## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం



పెదనందిపాడు: మండలంలోని కొప్పర్రులో ఆదివారం శ్రీలక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా ఉదయం అర్చకులు వేముల కూర్మయ్య, చెన్నకేశవరావు ఆధ్వర్యంలో నరసింహ హోమం, పంచముఖి ఆంజనేయ ఆయుష్య హోమాలు, అభిషేక పూజలు జరిగాయి. అనంతరం స్వామి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామస్తులు వార్లు పోసి, కొబ్బరికాయలు కొట్టి నైవేద్యాలు సమర్పించారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిచెరుకూరు మండలం ఇంజనంపాడు గ్రామానికి చెందిన కొండమూరి పుల్లారావు(27) ఆదివారం రాత్రి చిలకలూరిపేట నుంచి గుంటూరుకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. ఈ క్రమంలో పొత్తూరు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో కళాలయ మెలోడీస్ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎ.వి. రత్నాజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 19వ సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. కార్యక్రమంలో అన్నదాన సమాజ చైర్మన్ పోకల వసంత్ ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. గాయకులు పి. మొగిలి, ఈ. భరత్ రెడ్డి, పి. గాయత్రీదేవి, వి.ఎస్.ఎస్. మల్లేశ్వర రావు, పావని అలనాటి పాటల్ని ఆలపించారు. అనంతరం కళాకారుల్ని సంస్థ నిర్వాహకులు సత్కరించారు.

### 27న రంగస్థల పురస్కారాల ప్రదానం

పాత గుంటూరు: కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని అన్నమయ్య కళావేదికపై ఈ నెల 27, 28వ తేదీల్లో ప్రపంచ రంగస్థల దినోత్సవం పురస్కరించుకుని ఆరుగురు కళాకారులకు పురస్కారాల్ని ప్రదానం చేస్తున్నట్లు అధ్యక్షుడు బొప్పన నరసింహారావు ఒక ప్రకటనలో తెలిపారు. 27న సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో పురస్కారాల ప్రదానం, రాత్రి 8 గంటలకు ప్రక్షాళన నాటిక, 28న సాయంత్రం 6 గంటలకు నాన్న నేనొచ్చేస్తా నాటిక, 8 గంటలకు మయసభ ఏకపాత్రాభినయం ఉంటాయని వివరించారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

### నేడు నల్ల బ్యాడ్జీలతో వైద్యుల నిరసన

గుంటూరు మెడికల్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్(ఐఎంఏ) జాతీయ కార్యవర్గం పిలుపు మేరకు సోమవారం వైద్యులంతా నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరుకావాలని ఐఎంఏ గుంటూరు శాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఆవుల శ్రీనివాస్, డాక్టర్ వెలగా మహేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన లోపభూయిష్టమైన ఆరోగ్య హక్కు చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న వైద్యులపై పోలీసుల అమానుష లాఠీచార్జికి నిరసనగా సోమవారం ఐఎంఏ ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమంలో వైద్యులంతా పాల్గొనాలని వారు కోరారు.

### వృద్ధుడి అదృశ్యం

గుంటూరు ఈస్ట్: వృద్ధుడి అదృశ్యంపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఏటీ అగ్రహారం 1వ లైనుకు చెందిన నాగశివారెడ్డి తండ్రి అచ్చిరెడ్డి గత సంవత్సరం జూన్‌లో మతిస్థిమితం లేని కారణంగా ఇంటి నుంచి ఎటో వెళ్లి పోయారు. ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో ఆదివారం నాగశివారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

**యువకుడిపై పలువురి దాడి**

ఓ యువకుడిపై పలువురు దాడి చేసి గాయపరిచిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 7వ లైనులో యర్రా ఉదయ్‌కిరణ్ మేనకోడలితో మాట్లాడుతుండగా, కొంతమంది యువకులు వారిని చూసి కామెంట్ చేశారు. దీంతో ఉదయ్‌కిరణ్ వారిని ప్రశ్నించాడు. అక్కడి నుంచి వెళ్లిపోయిన యువకులు మరికొంత మందిని తీసుకుని వచ్చారు. నాగ అనే వ్యక్తి ఉదయ్‌కిరణ్‌పై రాడ్డుతో దాడి చేయగా రవితేజ, మరి కొంతమంది రాళ్లతో, చేతులతో దాడి చేసి కొట్టారు. ఆసుపత్రిలో చికిత్స అనంతరం ఉదయ్‌కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

# ఆసరాతో డ్వాక్రా మహిళల ఆర్థిక ప్రగతి



వట్టిచెరుకూరులో ఆసరా మెగా చెక్‌ను డ్వాక్రా మహిళలకు అందజేస్తున్న ఎమ్మెల్యే సుచరిత



కుర్నూతలలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న డ్వాక్రా మహిళలు

- ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత
- వట్టిచెరుకూరులో మూడో విడత 'ఆసరా' సంబరాలు

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు 'ఆసరా'తో ఆర్థిక ప్రగతి లభిస్తుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోట సుచరిత తెలిపారు. నియోజకవర్గంలో మూడవ విడత 'వైఎస్సార్ ఆసరా' పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం మండల కేంద్రం వట్టిచెరుకూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుచరిత డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందజేశారు. ఆసరా ద్వారా చేకూరుతున్న ప్రయోజనాలు, స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు ఆసరా ఎలా అండగా నిలుస్తుందన్న విషయాలపై లబ్ధిదారులతో ఆమె చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకున్నప్పటికీ, సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఏటా క్రమం తప్పకుండా ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వైఎస్సార్ ఆసరా, సున్నా వడ్డీ, చేయూత వంటి సంక్షేమ పథకాలు పేద మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు వారి కుటుంబాల్ని ఆర్థిక ప్రగతి వైపు నడిపిస్తున్నాయని ఆమె వివరించారు.

**నియోజకవర్గంలో రూ. 105.69 కోట్ల లబ్ధి**

నియోజకవర్గంలోని డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.105.69 కోట్ల లబ్ధి చేకూరిందని ఎమ్మెల్యే సుచరిత తెలిపారు. 4,235 గ్రూపులకు మొదటి విడతలో రూ. 35.20 కోట్లు, రెండో విడతలో రూ. 35.27 కోట్లు, మూడవ విడతలో రూ. 35.23 కోట్ల చొప్పున నగదును సీఎం జగన్‌మోహన్ రెడ్డి నేరుగా డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేశారని సుచరిత వివరించారు. ఒక్క వట్టిచెరుకూరు మండలంలోనే మూడో విడత కింద 996 గ్రూపుల్లో 9,960 మంది మహిళలకు గాను రూ. 8.96 కోట్లను వారి ఖాతాలకు జమచేసిన ఘనత వైఎస్సార్ సీపీదని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భీమినేని వెంకటలక్ష్మి, ఎంపీపీ చిలకా రాజ్యం, మన్నవ వీరనారాయణ, ఎస్. రామచంద్రయ్య, ఎంపీడీవో దీప్తి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నాయకులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

**సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం**

వైఎస్సార్ ఆసరా సంబరాల్లో భాగంగా వట్టిచెరుకూరు మండల పరిధిలోని కుర్నూతలలో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేశారు. గ్రామ సర్పంచ్ యర్రాకుల గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మహిళలు స్థానిక గ్రామ సచివాలయ వద్ద సీఎం చిత్రపటానికి అభిషేకం చేశారు. థాంక్యూ సీఎం సర్ అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఆసరా ఎంతగానో ఉపయోగపడుతుందని, స్వయం ఉపాధి యూనిట్లు సైతం నెలకొల్పుకునేందుకు వీలుఉంటుందని మహిళలు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ బుర్రి ప్రకాష్, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

# భాష, సాహిత్యం అభివృద్ధికి సమష్టి అవసరం

- అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు



కార్యక్రమంలో పాల్గొన్న సాహితీ వేత్తలు

గుంటూరు రూరల్: తెలుగు భాష, సాహిత్యాన్ని పరిపుష్టం చేయాలంటే ప్రభుత్వ కృషి ఒక్కటే సరిపోదని అందుకు భాషాభిమానులు, సాంస్కృతిక సంస్థలు కూడా దోహదపడాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు తెలిపారు. సాహితీ కిరణం సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం శోభకృత్ నామ ఉగాది వేడుకలు, కవి సమ్మేళనాన్ని మండలంలోని పొత్తూరులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని విజయబాబు మాట్లాడుతూ చిన్న గ్రామంలో జరిగిన ఈ వేడుకల్లో కాకినాడ, విశాఖపట్నం, నిజామాబాద్, ఖమ్మం రాజమండ్రి, హైదరాబాద్ లాంటి సుదూర ప్రాంతాల నుంచి కవులు, రచయితలు పాల్గొనడం సంతోష దాయకమన్నారు. కార్యక్రమానికి జీవీఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి అధ్యక్షత వహించగా, ప్రముఖ ఆడిటర్ రామరాజు శ్రీనివాసరావు, రచయిత, కవి సయ్యద్ జానీబాషా, వీవీ రాఘవరెడ్డి, సాహితీవేత్తలు పెద్దురి వెంకటదాసు, జొన్నాభట్ల నరసింహప్రసాద్, కూర చిదంబరం తదితరులు ప్రసంగించారు. సాహితీ కిరణం ఉగాది పురస్కారాన్ని ప్రముఖ వీణ విద్వాంసురాలు రామరాజు లక్ష్మీశ్రీనివాస్‌కు, ఆత్మీయ పురస్కారాన్ని డాక్టర్ తూములూరి రాజేంద్రప్రసాద్‌కు అందజేశారు. విడదల నీహారిక ఫౌండేషన్, కార్తీక డెవలపర్స్, జీవీఆర్ ఆరాధనా ఫౌండేషన్ సహకారంతో నిర్వహించిన కథ, కవిత, నవలా పోటీల్లో విజేతలైన సింహప్రసాద్, బాల గంగాధరయ్య, కళాగోపాల్, సుజనాదేవి, పొత్తూరు సీతారామరాజు, స్వర్ణశైలజ, సింగరాజు శ్రీనివాసరావుకు నగదు బహుమతులు అందించి, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వీఎస్ఆర్ సోమయాజులు నిర్వహించిన కవి సమ్మేళనంలో బండికల్లు జమదగ్ని, ఎస్ఎం సుభాని, బుర్ర కుమార్‌రాజా, దారవేముల అనిల్ కుమార్, సయ్యద్ జహీర్ అహ్మద్, అరుణకుమారి, శ్రీధర్, ఆంజనేయులు పాల్గొనగా నిర్వాహకులు పొత్తూరి సుబ్బారావు, జయలక్ష్మి వారిని సత్కరించారు. పొత్తూరి మురళీకృష్ణ, పద్మ దంపతుల సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది.

### మద్యం సీసాతో దాడిపై కేసు నమోదు

పెదకాకాని: మద్యం సీసాతో దాడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన చల్లా దయాకర్ పెదకాకాని మండలం మద్దిరాల కాలనీలో నివశిస్తున్న తల్లి వద్దకు వచ్చాడు. కాలనీ శివారులో ఉన్న బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ వద్ద ముళ్ల పొదల్లో కొందరు వ్యక్తులు ఉండగా అక్కడి వెళ్లి చూసేసరికి వారు పేకాటలు ఆడుతున్నారు. ఎందుకు వచ్చావు.. వెళ్లి సిగరెట్లు తీసుకురా అంటూ కేకలు వేయడంతో వాదన పెరిగి చొక్కా పట్టుకుని కొట్టారు. ఆ తరువాత కొంతసేపటికి దయాకర్ మామయ్యను వెంట పెట్టుకుని సమీపంలోని బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఉన్న పేకాటరాయుళ్ల వద్దకు వెళ్లి దాడిపై నిలదీశాడు. మళ్లీ వాగ్వివాదం జరిగి చేతిలో ఉన్న బీరు బాటిల్‌తో దయాకర్ తలపైన, ముఖంపైనా కొట్టి గాయపరచారు. బాధితుడు దయాకర్ ఫిర్యాదు మేరకు ఆదివారం ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

# సీఎం జగన్ పాలన దేశానికే ఆదర్శం

- శాసనమండలి చీఫ్ విప్, మాజీ కేంద్ర మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు
- పొన్నూరులో వ్యవసాయ మార్కెట్టు కమిటీ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులతో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



సభలో మాట్లాడుతున్న శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తదితరులు



పార్టీ శ్రేణుల భారీ బైక్ ర్యాలీ

పొన్నూరు(చేబ్రోలు): ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి పాలన దేశానికే ఆదర్శనీయమని శాసనమండలి చీఫ్ విప్, మాజీ కేంద్ర మంత్రి ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. పొన్నూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఆదివారం కమిటీ నూతన పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. వ్యవసాయ మార్కెట్టు యార్డు చైర్మన్‌గా ఆకుల వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్‌గా గూడవల్లి పద్మావతి, 15మంది పాలకవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవ సభకు స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా గుంటూరు వెస్ట్ ఎమ్మెల్యే ముస్తాఫా, ఎమ్మెల్సీలు మర్రి రాజశేఖర్, చంద్రగిరి ఏసురత్నం, తాడిశెట్టి మురళి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా, ఏ నాయకుడు చేయలేని విధంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను బైబిల్, ఖురాన్, భగవద్గీతలుగా భావించి, పూర్తి స్థాయిలో అమలు పరిచి ప్రజలకు ఒక నమ్మకాన్ని కలిగించారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఆయన పాలన దేశంలోని ఇతర రాష్ట్రాలతో పాటు, ఇతర దేశాలు మెచ్చుకునే విధంగా ఉందని పేర్కొన్నారు. చంద్రబాబు నాయుడు లాంటి ప్రతిపక్ష నేతను తన రాజకీయ జీవితంలో మునుపెన్నడు చూడలేదని విమర్శించారు. ఆవేశంలో నోటికి వచ్చినట్లు వక్ర భాష్యం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆయన 2014లో రైతులకు రుణమాఫీ చేస్తామని ప్రకటించి రూ. 87 వేల కోట్లకు గాను రూ. 13 వేల కోట్లు మాత్రమే చేశారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులు, కౌలు రైతులకు అందించిన రుణాల్ని గణాంకాలతో వివరించారు. మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ పరిపాలనను ముఖ్యమంత్రి నెరవేర్చుతున్నారని తెలిపారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ బడుగు, బలహీన, వెనుకబడిన, పేద, మధ్యతరగతి వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. గుంటూరు తూర్పు శాసనసభ్యుడు మహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ పని చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ రైతాంగ సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. ఖ్యాతి గాంచిన గుంటూరు మార్కెట్టు యార్డుకు మూడు సార్లు చైర్మన్ చేసి, ప్రస్తుతం ఎమ్మెల్సీగా జగన్‌మోహన్‌రెడ్డి తనకు అవకాశం కల్పించారన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి తప్పకుండా న్యాయం జరుగుతుందని తెలిపారు. తాడిశెట్టి మురళి మాట్లాడుతూ రాజకీయాల్లో నీతి, నిజాయతీ, నిబద్ధత అవసరమని చెప్పారు.టీడీపీ దుష్ట రాజకీయాల్ని ప్రజలు గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనుల్ని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. రైతు భరోసా ద్వారా రూ.6,420 కోట్లను అన్నదాతల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. ఆర్బీకేల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా ఉండాలనే ఉద్దేశంతో రైతు విత్తనం నాటిన దగ్గర నుంచి పంట విక్రయించే వరకు ప్రభుత్వం అండగా ఉందని పేర్కొన్నారు. మార్కెట్ యార్డులో కోటి రూపాయల వ్యయంతో అగ్రి ల్యాబ్‌ను ఏర్పాటు చేసి రైతులకు చీడపీడలు, తెగుళ్ల పరీక్షలు చేసి ఎప్పటికప్పుడు వ్యవసాయ శాస్త్రవేత్తలు సలహాలు సూచనలు అందిస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు, దండమూడి గ్రామ సర్పంచ్ భవనం వంశీరెడ్డి స్వాగత ఉపన్యాసం చేశారు.

**వైఎస్సార్ సీపీ శ్రేణులు, అభిమానుల భారీ ర్యాలీ**

పొన్నూరు నియోజకవర్గ పరిధిలోని పెదకాకాని, చేబ్రోలు, పొన్నూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి మార్కెట్ యార్డ్ వరకు బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. తీన్ మార్ డప్పుల హోరు, యువత కేరింతలతో ర్యాలీ కొనసాగింది. రామ మందిరం సెంటర్‌లో వంగవీటి మోహనరంగా విగ్రహానికి, ఐలాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి, మహానేత వైఎస్సార్ తదితర విగ్రహాలకు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. నాయకులు, అభిమానులు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావుకు క్రేన్‌తో భారీ గులాబీల గజ పూలమాల వేసి ఘనంగా సత్కరించారు.

**నూతన పాలకవర్గం**

నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ గూడవల్లి పద్మావతి, పాలకవర్గ సభ్యుల్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకుల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య, పాలకవర్గ సభ్యుల సహకారంతో యార్డ్ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత కర్లపూడి రమేష్, స్టేట్ మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, రాష్ట్ర ఇరిగేషన్ బోర్డు డైరెక్టర్ దాసరి నారాయణ రావు, యువజన నాయకుడు ఆకుల రామ్మోహన్, ఇందేటి వెంకటసుబ్బయ్య, కుర్రా పాములు, షేక్ మాము, బొద్దులూరి రంగారావు, కొల్లేరు శ్రీనివాసరావు, గూడవల్లి గంగాధర్, పెరికల కృష్ణమోహన్, అంబటి వెంకటేశ్వరరావు, యార్డు నూతన పాలకవర్గ సభ్యులు, వైఎస్సార్ సీపీనాయకులు భారీసంఖ్యలో పాల్గొన్నారు.

### చిన్ననాటి నుంచే సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలి



అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ సాంబశివరావు

గుంటూరు రూరల్: విద్యార్థులు చిన్ననాటి నుంచి సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని చల్లావారిపాలెం గ్రామ సర్పంచ్ ఆరుదల సాంబశివరావు తెలిపారు. చల్లవారిపాలెంలో నగరంలోని టీజేపీఎస్ కళాశాల జాతీయ సేవా పథకం విద్యార్థులు వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో విద్యార్థులు సేవా కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. గ్రామస్తులకు వ్యక్తిగత శుభ్రత, పారిశుద్ధ్యం, చదువు ప్రాముఖ్యత, వ్యసనాల వల్ల కలిగే నష్టాలు, వైద్య శిబిరం, వివిధ సామాజిక అంశాల గురించి అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి జె.వి. సుధీర్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి సేవా కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఎదుటువారిని ప్రేమించే గుణం ఏర్పడతాయని పేర్కొన్నారు. సమాజ స్థితిగతులు తెలుస్తాయని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్సిటీ కో-ఆర్డినేటర్ రవి శేఖర్, అసిస్టెంట్ కో- ఆర్డినేటర్ రవిశంకర్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ తెల్లాకుల శ్రీనివాసబాబు, ప్రిన్సిపాల్ ఏబీపీ మనోహర్‌తో పాటు సెక్రటరీ కె.లక్ష్మి, వీఆర్వో సీహెచ్. లూర్థురాజు పాల్గొన్నారు.

### నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజూ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఐదు వరకు స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.



# సందడిగా బాసర కాన్సెప్ట్ స్కూలు వార్షికోత్సవం



వివిధ పోటీల్లో విజేతలతో పాఠశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులో గల బాసర కాన్సెప్ట్ స్కూలు 16వ వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సోషల్ ఫిజియాలజీ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ నూతలపాటి అరవింద్ మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుంచి విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా భవిష్యత్తులో సమాజాభివృద్ధికి వారు దోహదపడతారని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో కూడా ప్రావీణ్యత సాధించాలని సూచించారు. ఫిజియాలజీ ప్రొఫెసర్ శంకర్ పిచ్చయ్య మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్యా విధానాలతో చిన్నారులకు సులువుగా అర్థమయ్యే రీతిలో బోధన ఉండాలని తెలిపారు. చిలకలూరిపేట రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ భీమనాథం పేరిరెడ్డి మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని, రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యా విధానంలో ఎన్నో మార్పులు తెచ్చిందని తెలిపారు. బాసర విద్యా సంస్థల చైర్మన్ సాధినేని మురళీమోహనరావు మాట్లాడుతూ నైతిక విలువలతో కూడిన విద్యా విధానాల్ని అవలంబిస్తూ విద్యార్థులకు బంగారు భవిష్యత్తు లక్ష్యంగా బోధన చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ పోటీల్లో విజేతలకు స్కూలు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సాధినేని రాధ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

### మద్యం మత్తులో కారు డ్రైవర్ బీభత్సం



గుంటూరు రూరల్: మద్యం మత్తులో యువకుడు కారుతో రోడ్డుపైకి హల్‌చల్ చేసిన సంఘటన నల్లపాడు పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. పిడుగురాళ్లకు చెందిన చల్లా బాబు నగర శివారులోని ఇన్నర్ రింగ్ రోడ్డులో ఒక అపార్ట్‌మెంట్‌కు వాచ్‌మేన్‌గా పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం ఒక ఫ్లాట్ ఓనర్ కారును కడగమని తాళాలు ఇచ్చాడు. అయితే, వాచ్‌మేన్ బాబు కారును తీసుకుని మహాలక్ష్మి బార్ వైపుకు వచ్చి మద్యం, గంజాయి తాగాడు. అనంతరం మత్తులో తిరిగి అపార్ట్‌మెంట్‌కు వెళ్తూ అడ్డు వచ్చిన మూడు కార్లు, రెండు ద్విచక్ర వాహనాల్ని ఢీకొట్టుకుంటూ వెళ్లి రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొట్టి ఆగిపోయాడు. దీంతో స్థానికులు కారు వెంటపడి, బాబును అందులో నుంచి దించి దేహశుద్ధి చేశారు. అనంతరం నల్లపాడు పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పోలూరికి ఎంపీ పరామర్శ

గుంటూరు లీగల్: వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురయ్యారు. గుండె ఆపరేషన్ చేయించుకుని ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చారు. నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు ఆదివారం పోలూరిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి, యోగక్షేమాల్ని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.